మద్దతు ధర పొందాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సంగెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 11: రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. మండలంలోని సంగెం, నాగులపేట, మాదాపూర్, పైడిమడుగు, జోగిన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సహకార సంఘాల అధ్యక్షులు సింగిరెడ్డి నర్సారెడ్డి, అయిల్నేని జగన్‌మోహన్‌రావు, గడ్డం ఆదిరెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు, కోరుట్ల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కాశిరెడ్డి మోహన్‌రెడ్డి, ఏఎంసీ శంకర్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు జ్యోతిబా పూలే

ఆదర్శనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పూలే గొప్ప సంఘ సంస్కర్త అని, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధరణకు ఎంతో కృషి చేశాడని కొనియాడారు. పూలే సతీమణి సావిత్రీబాయి పూలే మహిళా విద్యకు మార్గదర్శకురాలని తెలిపారు. యువత జ్యోతిబా పూలే సేవలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్, మాజీ కౌన్సిలర్లు సత్యం, సునీల్, నాయకులు సురేందర్, నగేశ్, అతిక్, ఆనంద్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

భక్తులతో కిటకిటలాడుతున్న అంజన్న ఆలయం

కొండగట్టు కాషాయమయం

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన హనుమాన్ దీక్షాపరులు
- నేడు హనుమాన్ చిన్న జయంతి

మల్యాల, ఏప్రిల్ 11: కొండగట్టు ఆంజనేయ స్వామి పుణ్యక్షేత్రంలో హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు హనుమాన్ దీక్షాపరులు కొండగట్టుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం మాల విరమణ చేశారు. జయంత్యుత్సవాల నేపథ్యంలో 7 చోట్ల వాహనాల పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. పార్కింగ్ స్థలాల నుంచి భక్తులను ఆలయ ప్రాంగణంలోని వై జంక్షన్ వరకు ఉచితంగా తరలించేందుకు ఆర్టీసీ రెండు మినీ బస్సులను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. కాగా, బస్సులను ఆలయ ఈవో శ్రీకాంతరావు, హనుమాన్ జయంత్యుత్సవాల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. అలాగే, కాలినడకన కొండగట్టుకు వచ్చే దీక్షాపరులకు జగిత్యాల-కరీంనగర్ రహదారితో పాటు కొండపైన పలువురు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ధరూర్ ఎస్సారెస్పీ కాలువ సమీపంలో జేకేసీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ట్రాన్స్ పోర్ట్ యజమాని చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చలి వేంద్రం, పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. నూకపల్లి శివారులో జగిత్యాలకు చెందిన జయశ్రీ ఫ్లెక్సీ ప్రింటర్స్ యజమాని ముసిపట్ల దేవేందర్ తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కొండపైన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి నేతృత్వంలో వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ వాహనం ద్వారా మజ్జిగ పంపిణీ చేశారు. కరీంనగర్‌లోని ప్రకాశం గంజ్‌కు చెందిన వరసిద్ధి వినాయక సేవా సమితి సభ్యులు అల్పాహారం, అన్నప్రసాదం అందజేశారు.

బందోబస్తును పరిశీలించిన డీఎస్పీ

కొండగట్టులో బందోబస్తును డీఎస్పీ రఘుచందర్ పర్యవేక్షించారు. మాల విరమణ మండపం ముందు సెల్లార్, బారికేడ్లు, క్యూ లైన్లను పరిశీలించి, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వై జంక్షన్ వద్ద పోలీసులు మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసి తనిఖీలు చేశారు. ఆలయంలో, పోలీస్ ఔట్ పోస్టు వద్ద ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములలో సీసీ కెమెరాల పుటేజీల ద్వారా మల్యాల సీఐ నీలం రవి, ఎస్ఐ నరేశ్ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

కొండపై భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం మెడికల్ క్యాంపులను పరిశీలించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో పులి మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, డీపీవో మదన్‌మోహన్, ఈవో శ్రీకాంతరావు, ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఏసీ నాయిని సుప్రియ, తదితరులున్నారు.

జగిత్యాల: పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీసీ సంఘాల నాయకులు

మెట్‌పల్లి రూరల్: ఆత్మకూర్‌లో పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు

ఘనంగా పూలే జయంతి వేడుకలు

- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

జగిత్యాల/ మెట్‌పల్లి / కోరుట్ల/ మల్లాపూర్ / జగిత్యాల టౌన్/ మెట్‌పల్లి రూరల్/ జగిత్యాల టవర్‌సర్కిల్/ రాయికల్ / మేడిపల్లి/కథలాపూర్, ఏప్రిల్ 11: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జ్యోతిబా పూలే విగ్రహాలు, చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమోద్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఎన్ఎస్ఎస్ పీవోలు సంగీతా రాణి, సుజాత, నీరజ, వాసవి, మల్లికార్జున్, జమున, అధ్యాపకుడు రహీమ్ పాల్గొన్నారు. అలాగే, ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ అరిగెల అశోక్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాస్, కే శ్రీనివాస్, రాజు, అంకం గోవర్ధన్, డాక్టర్ సాయిమధుకర్, సురేందర్, దివ్య రాణి, గణపతి, రజిత, ప్రతిభ పాల్గొన్నారు. మెట్‌పల్లి బార్ అసోసియేషన్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తొగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గజెల్లి రాందాస్, కోశాధికారి పడిగెల శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శి పులి నర్సయ్య, కల్చరల్ కార్యదర్శి సుమలత, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో పూలే చిత్రపటానికి పార్టీ నాయకులు లెల్లల బాలకృష్ణ, పుప్పాల శ్రీకాంత్, తిరుపతి నాయక్, వినోద్, మహిపాల్ నాయక్, వెంకటా చారి, వినోద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్, జగ్గసాగర్, బండలింగాపూర్ గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో నాయకులు నేరెళ్ల శ్రీనివాస్, చిలివేరి దిలీప్ గౌడ్, నేరెళ్ల లక్ష్మణ్, పసుల సుమన్, నేరెళ్ల సృజన్, కొడిగంటి లింబాద్రి, మెడిచెల్మెల రవి, కాటిపెల్లి ప్రదీప్, పుల్ల జగన్‌గౌడ్, కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి, డాకూరి వెంకటేశ్, పుల్ల చంద్రయ్య, కొట్టాల శ్రీనివాస్, శేఖర్, గంగాధర్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు. మల్లాపూర్, ముత్యంపేట గ్రామాల్లోని పూలే విగ్రహాలకు నాయకులు బండి లింగస్వామి, ముద్దం సత్యనారాయణ, సిరిపురం రాజ్‌కుమార్, పెద్దిరెడ్డి లక్ష్మణ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కోరుట్ల పట్టణంలోని సీ ప్రభాకర్ స్మారక గ్రంథాలయ కమిటీ, రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శికారి గోపీకృష్ణ, సంయుక్త కార్యదర్శి తుమ్మనపల్లి రాజేంద్రప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్, బీసీ సంఘం నాయకులు రుద్ర శ్రీనివాస్, గడ్డం మధు, జిల్లా ధనుంజయ్, గ్రంథాలయ కమిటీ నాయకులు చెన్న విశ్వనాథం, రాస భూమయ్య, మౌలానా, పెద్ద దేవయ్య, సుతారి రాములు పాల్గొన్నారు. రాయికల్ తహసీల్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి తహసీల్దార్ ఖయ్యూం, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమారం మండలం లింగంపేటలో పూలే విగ్రహానికి టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మిట్టపల్లి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పుప్పాల కొమురయ్య, మాజీ ఉపసర్పంచ్ గంగారెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కథలాపూర్ మండలం సిరికొండలో పూలే చిత్రపటానికి నాయకులు దొప్పల జలేందర్, హైమావతి, దయాకర్, అనిల్, గంగారం, రిషిత్, అఖిల్, మణితేజ, నవనీత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగిత్యాలలోని పూలే పార్కులో జిల్లా బీసీ సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, బీసీ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, హరి అశోక్ కుమార్, కిషన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎమ్మెల్సీ ఎల్ రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి సునీత, కలెక్టరేట్ ఏవో, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను సక్సెస్ చేద్దాం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

జగిత్యాల, ఏప్రిల్ 11: జగిత్యాల నియోజకవర్గం నుంచి ఐదు వేల మందితో రజతోత్సవ సభకు వెళ్లి విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి ఐదు వేల మందితో వెళ్దామన్నారు. ఇక్కడ నియోజకవర్గ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల, ఏప్రిల్ 11: తాటిపల్లి గ్రామంలో గల తెలంగాణ గురుకుల పాఠశాల కమ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మానస శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీలో 44చొప్పున సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 23లోగా వెబ్‌సైట్‌లో (http:tgrjc.cgg.gov.in) దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని, విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ ద్వారా మాత్రమే సీట్ల కేటాయిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల/ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11: మల్యాల మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, రాజారాం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, కోమటికొండాపూర్ గ్రామాలకు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రశాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జగిత్యాల రూరల్/ సారంగాపూర్/పెగడపల్లి/ మల్లాపూర్/ మెట్‌పల్లిరూరల్/కథలాపూర్, ఏప్రిల్ 11: పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న పిల్లల తల్లులు, గర్భిణులకు పోషకాహారం, చిరుధాన్యాలు, రక్తహీనత, తదితర అంశాలపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

సారంగాపూర్, ఏప్రిల్ 11: రేషన్‌కార్డుల సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రేషన్‌కార్డుల సర్వే వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కారోబార్ పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరులకు మజ్జిగ, పండ్ల పంపిణీ

జగిత్యాల/సారంగాపూర్, ఏప్రిల్ 11: కొండగట్టులో హనుమాన్ దీక్షాపరులు, భక్తులకు జగిత్యాలకు చెందిన ముసిపట్ల వెంకటరమణయ్య-వెంకటలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు ముసిపట్ల దేవేందర్-భాగ్యలక్ష్మి, కూతురు కౌముది తాగునీరు, పండ్లు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. అలాగే, సారంగాపూర్‌లో స్థానిక నాయకులు, గ్రామస్తులు కాలినడకన కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ దీక్షాపరులకు మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. మండల కేంద్రానికి వచ్చిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్వాముల వద్దకు వెళ్లి అభినందించి, తన వంతుగా రూ. 2 వేల విరాళం అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సారంగాపూర్, ఏప్రిల్ 11: సారంగాపూర్‌కు చెందిన జాల కుంటమ్మ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శించారు. అలాగే, నాయకపు గూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న కొత్తూరి సత్తవ్వను పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు కొండ్ర రాంచందర్ రెడ్డి, చేకూట శేఖర్, ఆశాది హరీశ్, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కోటి రెడ్డి, శేఖర్, ఉపేందర్, వెంకటేశ్, గౌడశెట్టి రాజన్న, ఆశాది రాజన్న, బేర మహేశ్ ఉన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులు

వెల్గటూర్, ఏప్రిల్ 11: వెల్గటూర్ మండలం పాషిగాం గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జనార్దన్, ఉపాధ్యక్షుడిగా బరుపటి మహేశ్, ప్రధాన కార్యదర్శిగా నలిమెల సుజిత్, కోశాధికారిగా ఎంబటి శ్రీధర్, కార్యదర్శిగా రాకేశ్, సభ్యులుగా బొప్ప తిరుపతి, కే తిరుపతి, గోపతి నరేశ్, సాంబయ్య, రవికుమార్, రమేశ్, కొమురయ్య ఎన్నికయ్యారు.

పాఠశాలకు వెళ్లమన్నందుకు..

- ఉరేసుకొని పదేళ్ల బాలిక ఆత్మహత్య

సారంగాపూర్, ఏప్రిల్ 11 : పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించడంతో పదేళ్ల బాలిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బీర్‌పూర్ మండలం కందెనకుంట గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కందెనకుంటకు చెందిన గడ్డం వెంకటేశ్-రజిత దంపతుల కూతురు వైష్ణవి(10) మూడో తరగతి చదువుతున్నది. రెండు రోజులుగా పాఠశాలకు వెళ్లక పోవడంతో శుక్రవారం తల్లిదండ్రులు మందలించారు. ఆ తర్వాత వారు బర్రెలు మేపడానికి వెళ్లిపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలిక ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాలిక మరణంలో ఎవరిపైనా అనుమానం లేదని తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చందులాల్ పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 11: హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం ఆరెపేట గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ మేస్త్రీ పని చేస్తుండేవాడు. 2023 ఫిబ్రవరి 2న శివరాత్రి పండుగ రోజున స్నేహితులతో కలిసి ఇంటి వద్ద మద్యం తాగాడు. సిమ్‌కార్డు విషయమై షేక్‌అహ్మద్‌కు సురేశ్‌తో గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన సురేశ్ తన జేబులో ఉన్న నెయిల్ కట్టర్‌తో షేక్‌అహ్మద్ కడుపులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అహ్మద్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెట్‌పెల్లి పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో సాక్ష్యాధారాలు అందజేశారు. పీపీ మల్లికార్జున్ కేసు వాదించి నేరాన్ని రుజువు చేయడంతో సురేశ్ జీవితఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ శుక్రవారం జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి నీలిమ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన మెట్‌పల్లి అప్పటి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శ్యాంరాజ్, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ రంజిత్, సీఎంఎస్ పీసీ కిరణ్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

మద్దతు ధర కల్పించేందుకే కేంద్రాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

కథలాపూర్, ఏప్రిల్ 11: రైతుల పంటలకు మద్దతు ధర కల్పించేందుకు సహకార సంఘాల ద్వారా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలికోట, అంబారిపేట, ఇప్పపెల్లి, దుంపేట, దూలూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఇక్కడ ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, డైరెక్టర్లు, నాయకులు కాయితి నాగరాజు, కల్లెడ గంగాధర్, నాగం భూమయ్య, కారపు గంగాధర్, రాజారెడ్డి, జవ్వాజి రవి, చౌదరి, మోహన్, సత్యనారాయణ, గంగారెడ్డి, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కథలాపూర్, ఏప్రిల్ 11: కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన పల్లికొండ అజయ్ (18) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్ తన స్నేహితుడితో కలిసి కథలాపూర్ నుంచి గుండు పెరమాండ్ల ఆలయం వైపు బైక్‌పై వెళ్తున్నారు. గ్రామ శివారులో రోడ్డు పక్కన ఇద్దరు పడిపోయారు. అజయ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడికి గాయాలు కాగా, కోరుట్ల పట్టణంలోని దవాఖానలో చేర్పించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. గ్రామంలోని సీసీ పుటేజీలను పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

మారుతీనగర్, ఏప్రిల్ 11: మెట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు దొమ్మటి ప్రవీణ్, దీక్షాపరులు పాల్గొన్నారు.

పసుపు క్వింటాల్ @ రూ.14,111

మెట్‌పల్లి, ఏప్రిల్ 11: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం పసుపు కొమ్ము (కాడి) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.14,111, కనిష్ఠంగా రూ.9 వేలు, పసుపు మండ (గోళ) గరిష్ఠంగా రూ.12,901, కనిష్ఠంగా రూ.9,296, పసుపు చూర గరిష్ఠంగా రూ. 10,151, కనిష్ఠంగా రూ.8,501 చొప్పున పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 44540 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

సీతారామచంద్రస్వామి రథోత్సవం

పెగడపల్లి, ఏప్రిల్ 11: నంచర్ల గ్రామంలో సీతారామచంద్ర స్వామి రథోత్సవం శుక్రవారం కనుల పండువలా నిర్వహించారు. విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత, మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, హరిగోపాల్, ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, సింగిల్ విండో చైర్మన్లు వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి మైక్ సెట్ వితరణ

పెగడపల్లి, ఏప్రిల్ 11: ఐతుపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత ఎండీ రహీం శుక్రవారం రూ.10 వేల విలువైన మైక్ సెట్ అందజేశారు. రహీంను గ్రామస్తులు అభినందించారు.

ఇంటర్‌లో తెలుగు కొనసాగించాలి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 11: ఇంటర్‌లో మాతృభాష తెలుగు కొనసాగించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం సబ్జెక్టును ప్రవేశపెట్టేందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు ప్రారంభించిన నేపథ్యంలో శుక్రవారం సంఘ ముఖ్య నాయకులు జిల్లా కేంద్రంలో సమావేశమయ్యారు. సంస్కృతంతో విద్యార్థులకు ఉపయోగం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీజీజేఎల్ఏ 475 జిల్లా ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్, నాయకులు జయపాల్‌రెడ్డి, శ్రీహరి, సంతోష్‌కుమార్, రచన, సునీత పాల్గొన్నారు.

విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకలు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 11: నాగులపేటలోని శివాలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ దాతలు చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి-చైతన్యజ్యోతి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి నారాయణరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

రాయికల్, ఏప్రిల్ 11: పట్టణంలో వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులకు సూచించారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, మున్సిపల్ మేనేజర్ వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సత్కారం

మెట్‌పల్లి, ఏప్రిల్ 11: మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గజెల్లి రాందాస్, మహిళా ప్రతినిధి ఆకుల మానసను స్థానిక జ్ఞానోదయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, అధ్యాపకులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ కేవీ సంతోష్, వైస్‌ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలి

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 11: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులను నిరంతరం కొనసాగించాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ పార్కులో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టి, విగ్రహాలకు పెయింటింగ్ చేయించారు. అనంతరం డివైడర్ మధ్యలోని మొక్కలకు నీరు పట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇక్కడ ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, నరేశ్, తదితరులు ఉన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

రాయికల్, ఏప్రిల్ 11: పట్టణంలో శుక్రవారం భక్తులు హనుమాన్ శోభాయాత్ర చేపట్టారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొని దీక్షాపరులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, శ్రీధర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఆహ్వానం

జగిత్యాల, ఏప్రిల్ 11: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్సీ ఎల్ రమణను జగిత్యాలలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 27న జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో మొదటి జిమికాన్ 2025, అన్యువల్ మెడికల్ కాన్ఫరెన్స్, స్థానిక విరుపాక్షి గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇక్కడ జగిత్యాల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరీ డాక్టర్ కోటగిరి సుధీర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ నవీన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతి

మేడిపల్లి, ఏప్రిల్ 11: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గాజుల శ్రీనివాస్ శుక్రవారం మృతి చెందాడు. గాజుల శ్రీనివాస్ పార్థివ దేహాన్ని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ సందర్శించి, నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ భూమేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మకిలి దాస్, నాయకులు చెన్నమనేని అజిత్ రావు, నాంచారి రాజేందర్, దురిశెట్టి లక్ష్మణ్‌కుమార్, వెంకటేశ్, హరీశ్, రాకేశ్, సాయి, ప్రవీణ్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వెల్గటూర్, ఏప్రిల్ 11: ఎండపల్లి తహసీల్ కార్యాలయ ఆవరణలో 24 మంది లబ్ధిదారులకు విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గోపిక-జితేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE

★ కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం-1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.
NTK-337576

CHANGE OF NAME

★ I Kasetty Rajeshwer (old Name) R/o. 2-2-28, Metpally (M) Jagtial Dist, TS Have Changed name as "Kashetty Rajeshwar Rao" (New Name) S/o Kashetty Narayana. And My wife Kasetty Sandhya Rani (Old name) have Changed " Kashetty Sandhya Rani"
TTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189